క్లుప్తంగా

వార్డు సమస్యల పరిష్కారానికి చైర్మన్ హామీ

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణంలోని 20వ వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చినట్లు కోఆప్షన్ సభ్యులు అర్షద్‌అలీ తెలియజేశారు. జిల్లా కేంద్రంలోని మర్లులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 20వ వార్డులో చైర్మన్ దొంగచాటుగా పర్యటించారని కౌన్సిలర్ అనంత్‌రెడ్డి అనడం సరికాదన్నారు. వార్డులో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పాల్‌కొండ వార్డులో చైర్మన్ పర్యటిస్తున్నప్పుడూ 20వ వార్డుకు వచ్చినట్లు తెలిపారు. స్థానిక కౌన్సిలర్‌తో కలిసి వార్డులో పర్యటించి సమస్యలను గుర్తించాలని మున్సిపల్ ఎంఈ, ఏఈలకు చైర్మన్ సూచించినట్లు గుర్తుచేశారు. 20వ వార్డులో సమస్యల పరిష్కారానికి రూ.50 లక్షలు మంజూరు కానున్నాయని తెలియజేశారు.

ప్రజా సంక్షేమానికి కృషి

గండేడ్: ప్రజా సంక్షేమానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నిరంతర కృషి చేస్తున్నారని గండేడ్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సీడీపీ నిధులతో మండల కేంద్రంలో చేపట్టిన నూతన బోరు తవ్వకానికి ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

ఆకట్టుకున్న కళాజాతా

దేవరకద్ర: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సమీపంలోని పాత బస్టాండ్‌లో సోమవారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై నిర్వహించిన కళాజాతా అందరిని ఆకట్టుకుంది. కళాకారుల బృందం ఆట పాటలతో అలరిస్తూ.. ప్రజలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ఒకరి నుంచి మరొకరికి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎయిడ్స్ వస్తే భయపడాల్సిన పనిలేదని, మందులు వాడితే జీవిత కాలాన్ని పొడిగించకోవచ్చని తెలియజేశారు. వెన్నెల కల్చరల్ అకాడమీ ఏకే నర్సింలు, యాదగిరి, చెన్నయ్య పాల్గొన్నారు.

భోజన పాకెట్లు పంపిణీ

స్టేషన్ మహబూబ్‌నగర్: వీకేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ చౌరస్తా, ప్రభుత్వ ఆస్పత్రి, ఆర్టీసీ బస్టాండ్ కూడళ్లలో నిరుపేదలకు భోజన పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంతో రోడ్డుమీద ఉండే నిరుపేదలకు ఆకలితో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో భోజన ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. రవికిరణ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో వర్షం వెలిసినందున లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఓపెన్ ప్లాట్లలో నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద నాలాలు, డ్రెయినేజీలను శుభ్రం చేయాలన్నారు. గురులింగం, రవీందర్‌రెడ్డి, వజ్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రిని పరిశీలించిన ప్రత్యేకాధికారి

మిడ్జిల్: స్థానిక ఆస్పత్రిలోకి వరద నీరు రావడంతో పాటుగా మున్ననూర్‌లో కేఎల్ఐ కాల్వ తెగిపోవడంతో సోమవారం మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్ మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే మున్ననూర్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు.

వరిపంటలో ఇసుక మేటలు

హన్వాడ: మండల పరిధిలోని నాగినోనిపల్లిలో రహదారి పక్కనే ఉన్న కుంట నిండి రోడ్డుపైకి రావడంతో రోడ్డుకు మరో పక్కకు ఉన్న వరిపంటలోకి నీరు వెళ్లడంతో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. మండల కేంద్రానికి చెందిన పలువురు రైతుల జొన్న పంటలు ఈదురు గాలులు, వర్షాలకు నేలకొరిగాయి. వేపూర్, కిష్టంపల్లి, టంకర, హన్వాడ, బుద్దారం గుడ్డిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సిబ్బంది వాటిని సరిచేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

యువకుడిపై దాడి..

మహబూబ్‌నగర్ క్రైం: పాతకక్షలను దృష్టిలో ఉంచుకొని ఓ బార్‌లో యువకుడిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. భగీరథకాలనీ సమీపంలోని భూత్పూర్ రహదారిపై ఉన్న ఓ బార్‌లో ఆదివారం పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు బీరు బాటిల్‌తో దాడి చేయడంతో తల, ముఖం, వీపు భాగంలో తీవ్రగాయాలయ్యాయి. సోమవారం ఉదయం జనరల్ ఆస్పత్రిలో యువకుడు చికిత్స చేయించుకున్నాడు. అయితే ఈ దాడి చేసిన తర్వాత ముగ్గురు వ్యక్తులు సదరు యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు చిత్రీకరించడానికి ప్రయత్నించారు. కానీ, విషయం బయటకు తెలియడంతో బాధితుడితో రాజీ కావడానికి దాడి చేసిన ముగ్గురు వ్యక్తులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.


భట్టుపల్లి వద్ద వైకుంఠధామం నుంచి ప్రవహిస్తున్న వర్షం నీరు


దేవులచెరువు అలుగులో చెట్లను తొలగిస్తున్న అధికారులు

జలమయం..

- నిండిన చెరువులు, కుంటలు
- తెగిన కాజ్‌వేలు, చెక్‌డ్యాంలు
- కూలిన ఇళ్లు
- పరిశీలించిన దేవరకద్ర ఎమ్మెల్యే జీఎమ్మార్
- వ్యవసాయ పంటలపై సూచనలు చేసిన అధికారులు


అడ్డాకుల పెద్ద చెరువు అలుగు వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండాయి. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దవాగు పొంగిపొర్లుతోంది. పెద్దవాగు నుంచి పొన్నకల్, గుడిబండ చెరువులకు నీళ్లు వెళ్లడంతో అవి కూడా అలుగు పారుతున్నాయి.

భూత్పూర్: రెండు రోజులుగా కురుసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండి అలుగుపారతుండగా.. వైకుంఠధామాలకు నీరు చేరింది. మండలంలోని కప్పెట, భట్టుపల్లి గ్రామాలకు చెందిన వైకుంఠధామాలు చెరువుకు దగ్గరలో నిర్మించడంతో నీరు చేరింది.

చెరువుల పరిశీలన..

గండేడ్: ప్రమాదకరంగా ఉన్న మండల పరిధిలోని సాలార్‌నగర్ ప్రాజెక్టు, గండేడ్ దేవుల్‌చెరువులు తదితర వాటిని సోమవారం అధికారులు పరిశీలించారు. సాలార్‌నగర్ ప్రాజెక్టు కట్ట దెబ్బతింది. ఏఈఈ మనోజ్ వర్క్ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య అక్కడికి చేరుకొని పరిశీలించారు.

కొత్తూర్‌లో తెగిన చెక్‌డ్యాం..

మిడ్జిల్: మండల పరిధిలోని కొత్తూర్‌లోని దుందుభి వాగులో గతేడాది దాదాపు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యాం సోమవారం తెగిపోయినట్లు స్థానికులు తెలిపారు. నాసిరకం పనులు చేయడంతో చెక్‌డ్యాం తెగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.


మిడ్జిల్ మండల పరిధిలోని కొత్తూర్‌లో తెగిన చెక్‌డ్యాం

కాజ్‌వేను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎమ్మార్..


పోతులమడుగు వద్ద కాజ్‌వేపై పారుతున్న వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎమ్మార్

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు వద్ద సోమవారం కాజ్‌వేను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. కాంగ్రెస్ మండల నాయకులు ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వడంతో కాజ్‌వేను పరిశీలించారు. కాజ్‌వే నిర్మాణానికి ప్రపోజల్స్ తయారు చేసి పంపించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

చిన్నచింతకుంట: వర్షాల కారణంగా గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామ సమీపంలోని చెరువు కాల్వ నుంచి ఎస్సీ కాలనీలోకి చేరిన నీటిని, పర్కపురం గ్రామ సమీపంలో బ్రిడ్జిపై పారుతున్న మన్నెపు వాగు వరద నీటిని పరిశీలించారు.

నవాబుపేట చెరువుకు గండి

నవాబుపేట: మండల కేంద్రంలోని చెరువు నిండిందనే ఆనందం తీరకముందే చెరువు కట్టకు గండిపడింది. దీంతో జనం ఆనందం వదిలి ఆందోళనలో పడ్డారు. నవాబుపేట, యన్మన్‌గండ్ల జంట గ్రామాలకు చెందిన పెద్దచెరువు ఇప్పటికే రెండు సంవత్సరాల కిందట చెరువు కట్ట తెగిపోగా తాజాగా రెండేళ్ల తర్వాత చెరువు నిండింది. చెరువు నీటిని తిలకిస్తుండగా.. కట్టకు ఒక పెద్ద గండి కనిపించింది. దీంతో రైతులు ఆందోళన చెంది సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టి గండిని పూడ్చివేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

మల్కచెరువు కట్టపై రంధ్రం...

మహమ్మదాబాద్: స్థానిక చెరువు కట్టపై తూముకు దగ్గరలో రంధ్రం పడింది. విషయాన్ని స్థానికులు మండల అధికారులకు సమాచారం ఇచ్చారు. సోమవారం మండల ప్రత్యేక అధికారి ఛత్రునాయక్, ఎంపీడీఓ దేవన్న, ఇరిగేషన్ ఏఈ మనోజ్, ఎసఐ శేఖర్‌రెడ్డి రంధ్రాన్ని పరిశీలించారు. అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఈ మనోజ్ తెలియజేశారు.


నవాబుపేట చెరువుకు పడిన గండి

ప్రజలను అప్రమత్తం చేయాలి

దేవరకద్ర/చిన్నచింతకుంట: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం ఆమె చిన్నచింతకుంట మండలంలోని పర్కాపురం, పెద్దవడ్డేమాన్ గ్రామాల మధ్య ఉన్న మన్నెపు వాగు బిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీటిని, సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా పారుతున్నాయని, సమీప ప్రాంతాల ప్రజలు వాగు పరిసరాల్లో తిరగకుండా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సబ్‌స్టేషన్‌లోకి వరద నీరు చేరిన కారణంగా ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే కోయిల్‌సాగర్ ప్రాజెక్టును సందర్శించి.. 4 గేట్లు తెరిచి నీటిని వదిలిన దృశ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్‌తో మాట్లాడి సాగు వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు గేట్లు తెరవడం వల్ల నీటి ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, పర్యాటకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


కోయిల్‌సాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర తదితరులు

పంటలను కాపాడుకోవాలి

రాజాపూర్: కురుస్తున్న వర్షాలకు రైతులు తాము సాగు చేసుకున్న పత్తి, వరి పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఈద్గాన్‌పల్లి, కల్లేపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పత్తి, వరి పంటలను పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ముఖ్యంగా పంటచేలలో నిలిచిన వర్షపు నీటిని తొలగించాలన్నారు. రాబోవు రెండు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

పరిశీలించిన ఏఓ

అడ్డాకుల: మూసాపేట మండలం వేములలో వరి పంటలను మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో రైతులు వాటిని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వర్షాలు కురుస్తున్నందున పంటలకు మందుల పిచికారీని తాత్కాలికంగా వాయిదా వేయాలని చెప్పారు. ఆరుతడి పంటలను పరిశీలించి రైతులు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.


పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న ఏఎంఓ ప్రదీప్‌గౌడ్

మహానేతకు ఘన నివాళి

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. వైఎస్‌ఆర్ వర్ధంతి సందర్భంగా సోమవారం మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గ కేంద్రాలు, మండలాలు, గ్రామాల్లో వైఎస్‌ఆర్ విగ్రహానికి, చిత్రపటాలకు, కాంగ్రెస్ నాయకులు, ఆయన అభిమానులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

– 'సాక్షి'నెట్‌వర్క్


జడ్చర్లలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మిడ్జిల్‌లో..


వెన్నాచేడ్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

అవినీతి నిరూపిస్తే రాజకీయ సన్యాసం

జడ్చర్ల: తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ఎక్కడైనా అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి సవాల్ విసిరారు. సోమవారం ఆయన స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఎక్కడ పడితే అక్కడ తమపై అర్థం లేకుండా చేస్తున్న ఆరోపణలపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఎన్నో మాట్లాడుతాం.. తరువాత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించే సాంప్రదాయం ఉండేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే అలా కాకుండా దుష్ట సాంప్రదాయానికి తెర తీశారన్నారు. ఎన్నికల తరువాత ఎమ్మెల్యే పనితీరుపై వెంటనే స్పందించకూడదని, ఇన్నాళ్లు వేచిచూశామన్నారు. పదేళ్ల తన పదవీ కాలంలో మచ్చుకైనా అవినీతికి పాల్పడలేదన్నారు. పోలేపల్లి సెజ్ నుంచి తమకు ప్రతి నెల రూ.70 లక్షలు ఇచ్చేవారని తప్పుడు ఆరోపణలు చేసిన ఎమ్మెల్యేకు, 9 నెలల కాలంలో ఎంత డబ్బు ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రికి ఎక్కడా స్థలం లేకపోవడంతో స్థల సేకరణకు గాను తాను సొంతంగా డబ్బులు ఇచ్చి ఆ స్థలంలో ఆస్పత్రిని నిర్మించామన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పట్టణంలో ఎక్కడైనా సరే స్థలం చూపిస్తే తాను సొంత ఖర్చుతో ఆస్పత్రిని నిర్మిస్తానన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, నాయకులు రాంమ్మోహన్, మురళి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

బాధితులకు అండగా ఉంటాం..


కూల్చిన ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీ డీకే అరుణ

పాలమూరు: నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు కూల్చివేయడం అన్యాయమని, న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని 523 సర్వే నంబర్ బాధితులకు ఎంపీ డీకే అరుణ భరోసా ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లోని 523 సర్వే నంబర్‌లోని కూల్చివేసిన ఇళ్ల బాధితులను సోమవారం ఎంపీ డీకే అరుణ పరామర్శించారు. కలెక్టర్, ఎమ్మెల్యే, తహసీల్దార్‌లతో ఫోన్ మాట్లాడి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎందుకు కూల్చారనే అంశంపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, అంజయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు



భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో 10 ఇళ్లు కూలినట్లు తహసీల్దార్ పి.రాజు తెలియజేశారు. మండలంలోని కొత్తూర్‌లో ఓ ఇల్లు కూలిపోగా వారికి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఆశ్రయం కల్పించినట్లు చెప్పారు.

గండేడ్/మహమ్మదాబాద్: గండేడ్ మండల పరిధిలోని వీరపురం చెన్నమ్మ ఇల్లు, మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్లలో మున్నూరు నర్సమ్మకు చెందిన ఇల్లు ఆదివారం రాత్రి కూలిపోయింది. గండేడ్ మండల పరిధిలోని వెన్నాచేడ్, పగిడ్యాల్ గ్రామాల్లో కూలిన ఇళ్లను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు.

ఆర్థిక సాయం అందజేత

మిడ్జిల్: మండల పరిధిలోని వాడ్యాల్‌కి చెందిన వ్యాపార సంఘం సభ్యులు కోట రాఘవేందర్ అనారోగ్యానికి గురికావడంతో, సోమవారం మండల వ్యాపార సంఘం ఆధ్వర్యంలో రూ.40 వేలు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం అందజేశామని వ్యాపార సంఘం అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జహంగీర్, రాజేశ్వర్, అశోక్, జహీర్, శ్రీను, యాదగిరి, బాల్‌నారాయణ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచాలి

మహబూబ్‌నగర్ రూరల్: సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలంటూ కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడారు. పదేళ్ల నుంచి హాస్టల్ విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచకపోవడంతో నాసిరకమైన భోజనం తింటున్నారని అన్నారు. ప్రభుత్వం ఈ నెల 10వ తేదీలోపు హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీల విషయంలో స్పందించకుంటే చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

రిజర్వేషన్లు కల్పించాలని ధర్నా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని కులాలను లెక్కించాలని, ఎవరి కులం ఎంతో వారికి అంత వాట కేటాయించాలన్నారు. ఎన్నికల ముందు కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా.. ఇంకా కుల గణను చేపట్టడం లేదని ఆరోపించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు దోమవెంకటేశ్, వంశీ, బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వేరో సిద్ధాంతాన్ని గ్రామాలకు విస్తరించాలి


స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు ఇబ్రహీంబాద్ లక్ష్మణ్‌కు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: స్వేరో సిద్ధాంతాన్ని ప్రతి గ్రామానికి విస్తరించేందుకు కృషి చేయాలని స్వేరోస్ చీఫ్ కన్వీనర్ దుర్గన్న పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియాలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో స్వేరోస్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్యతో కలిసి మాట్లాడారు. అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే ప్రాథమిక అంశాలపై స్వేరో సంస్థ పనిచేస్తుందని, గ్రామీణ స్థాయిలో ప్రజలకు స్వేరో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని వర్గాలకు విద్య, వైద్యం, అన్ని రంగాల్లో అందరికి సమాన అవకాశాలు లభించిన నాడే సమసమాజ స్థాపన జరుగుతుందన్నారు. అంతకు ముందు స్వేరోస్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. స్వేరోస్ జిల్లా అధ్యక్షుడిగా ఇబ్రహీంబాద్ లక్ష్మణ్‌ను ఎన్నుకుని నియామక పత్రం అందజేశారు.

ముగిసిన శ్రావణమాస ఉత్సవాలు

నవాబుపేట: మండల పరిధిలోని లోకిరేవు వీరభద్ర స్వామి దేవాలయంలో శ్రావణమాస ఉత్సవాలు సోమవారం నిర్వహించిన మహా మంగళహారతి నిర్వహించారు.

జడ్చర్ల టౌన్: అమావాస్యను పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని సత్యనారాయణ స్వామి ఆలయ గోశాలలో గోపూజ నిర్వహించారు.

చండిహోమం..

దేవునిగుట్టతండా సమీపంలోని శ్రీగిరిక్షేత్రం అష్ట లక్ష్మి ఆలయంలో చండిహోమం నిర్వహించారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం కొత్తగంజిలోని లక్ష్మీనారసింహస్వామి దేవాలయంలో 108 కలశాలతో స్వామివారికి అభిషేకం చేశారు.

వైభవంగా శ్రీకృష్ణ ఊరేగింపు

నవాబుపేట: మండల పరిధిలోని చౌడూర్, కొల్లూర్ గ్రామాల్లో శ్రీకృష్ణ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, భజనలు చేశారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో గత నెల 26న ప్రారంభమైన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి.

వరద పాయస మహోత్సవం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై పురాతన కాలంలో వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద వరద పాయస మహోత్సవాన్ని నిర్వహించారు.

సరస్వతీదేవి ఆలయంలో..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులోని సరస్వతీదేవి ఆలయంలో సోమవారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

నేడు హనుమాన్ చాలీసా పారాయణం

గండేడ్: మండల పరిధిలోని వెన్నాచేడ్‌లో శ్రావణ మాసం ముగియడంతో మంగళవారం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నట్లు పూజారులు చెప్పారు.


జడ్చర్లలో గోపూజ చేస్తున్న భక్తులు

మాంస వ్యర్థాలకు రికార్డు స్థాయి ధర

జడ్చర్ల/ జడ్చర్లటౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో మాంస వ్యర్థాల సేకరణ, తరలింపు ప్రక్రియకు సంబంధించి సోమవారం నిర్వహించిన బహిరంగ వేలంలో రికార్డు స్థాయి ధర లభించింది. ఊహించని రీతిలో ఏకంగా రూ.70.50 లక్షల ఆదాయం మున్సిపల్‌కు దక్కింది. మున్సిపల్ పరిధిలో చికెన్, మటన్, చేపల విక్రయ దుకాణాల వద్ద నుంచి వ్యర్థాల సేకరణకు సంబంధించి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం వేశారు. వేలంలో జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లికి చెందిన నర్సింహులు రూ.70.50 లక్షలకు వేలం టెండర్‌ను దక్కించుకున్నాడు. ఏడాది పాటు టెండర్‌కు గడువు ఉంటుందని అధికారులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు పది మంది దాకా వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ రాజయ్య, వైస్ చైర్‌పర్సన్ సారిక తదితరులు పాల్గొన్నారు.

గతంలో ఈ ఆదాయం ఎక్కడా..

మున్సిపల్ పరిధిలో మాంస వ్యర్థాలకు సంబంధించి ఏడాది కాలానికి రూ.70.50 లక్షలు ఆదాయం వస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. మరీ ఇంత ఆదాయం ఇన్నాళ్లు ఎక్కడికి వెళ్లిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మున్సిపాలిటీ ఏర్పడి దాదాపు 8 సంవత్సరాలు గడిచినా ఏనాడు ఇలా వేలం నిర్వహించలేదు. లోగుట్టుగా ఈ తతంగాన్ని నడిపి సొంత జేబులోకి మళ్లించి మున్సిపల్‌కు వచ్చే ఆదాయానికి గండి కొట్టారన్న అనుమానాలు ఉన్నాయి. ఇటీవల వేలం నిర్వహించకుండా ఓ వ్యక్తికి కేవలం రూ.75 వేలకు మాత్రమే టెండర్‌ను అప్పగించారు. విషయం తెలిసిన స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వెంటనే ఆ టెండర్‌ను రద్దు చేసి, రీటెండర్ నిర్వహించాలని ఆదేశించారు. రీటెండర్‌లో రూ.70.50 లక్షల ఆదాయం వచ్చింది. వీటిపై విచారణ జరిపిస్తే అక్రమాలు బయటకు వచ్చే పరిస్థితి ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.


వేలం నిర్వహిస్తున్న కమిషనర్ రాజయ్య, వైస్ చైర్‌పర్సన్ సారిక